సాగునీటి కష్టాలు తీరేనా..?

ప్రభుత్వ ఆదేశాలతో ఐదేళ్ల తర్వాత సాగునీటి సంఘాలకు ఎన్నికలను నిర్వహించేందుకు జలవనరులశాఖ అధికారులు సమాయత్తం అవుతున్నారు. సంఘాల ఎన్నిక ద్వారా పంట కాలువల అభివృద్ధి, కాలువల వంతెనలు, తూములు ఇతరత్రా నిర్వహణ, మరమ్మతులు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఇందుకు ప్రభుత్వం నిధులు సమకూర్చనుంది. దీంతో ప్రస్తుతం గ్రామాల్లో సాగునీటి సంఘాల ఎన్నికల సందడి మొదలైంది.

- ఐదేళ్ల తర్వాత సాగునీటి సంఘాల ఎన్నికలకు మార్గదర్శకాలు విడుదల
- కసరత్తు మొదలు పెట్టిన జలవనరుల శాఖ అధికారులు
- సత్యవేడు నియోజకవర్గ పరిధిలో 107 సాగునీటి సంఘాలు
- డిసెంబర్ 5న తుది నోటిఫికేషన్
- అదే నెల 8న ఎన్నికలు
- జలాశయాలు, పంట కాలువలు, చెరువుల అభివృద్ధికి అవకాశం


వరదయ్యపాళెం మండలం పెద్ద పాండూరు ఇరిగేషన్ చెరువు (ఇన్‌సెట్)అరణియార్ ప్రాజెక్టు

వరదయ్యపాళెం: రైతులు పంటల సాగుకు ఊతమిచ్చేందుకు చెరువులు, జలాశయాలు ఏర్పడ్డాయి. ఏ ప్రభుత్వాలు వచ్చినా జలాశయాలు, చెరువుల అభివృద్ధి, ఆధునీకరణకు పెద్దపీట వేస్తారు. నిర్వహణ సక్రమంగా జరిగేందుకు అనువుగా సాగునీటి సంఘాలు ఏర్పాటయ్యాయి. సత్యవేడు నియోజకవర్గం పరిధిలో 2 ఇరిగేషన్ సబ్ డివిజన్లు ఉన్నాయి. అందులో పిచ్చాటూరు, సత్యవేడు ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలో 107 సాగునీటి సంఘాలు ఉన్నాయి. అలాగే పిచ్చాటూరు మండలంలోని అరణియార్ ప్రాజెక్టు మేజర్ జలాశయం ఉంది. ఆ మేరకు మైనర్ ఇరిగేషన్ చెరువులకు సంబంధించి 33,522 ఎకరాల ఆయకట్టు ఉంది. సత్యవేడు సబ్ డివిజన్ పరిధిలో 81 మైనర్ నీటి సంఘాలు ఉండగా, పిచ్చాటూరు సబ్ డివిజన్ పరిధిలో 26 మైనర్ నీటి సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల పరిధిలో ఎన్నికలు నిర్వహించేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు కసరత్తు మొదలుపెట్టారు.

అరణియార్ పరిధిలో 5,793 ఎకరాల ఆయకట్టు..

పిచ్చాటూరులోని మేజర్ జలాశయమైన అరణియార్ ప్రాజెక్టు పరిధిలో 5 నీటి సంఘాలు ఉన్నాయి. ఈ జలాశయం పరిధిలో 5,793 ఎకరాల ఆయకట్టు ఉంది. దీనికి సంబంధించి పిచ్చాటూరు మండలంలో 2, నాగలాపురం మండలంలో 3 ఆయకట్టు సంఘాలు ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఆ మేరకు ప్రాజెక్టు పరిధిలో ఉన్న 5 సంఘాలకు సంబంధించి రెండు మండలాల పరిధిలోకి వస్తాయి. ఆ దిశగా ఈ 5 సంఘాలకు సంబంధించి డిసెంబర్ 14న ఎన్నికలు జరగనున్నాయి. మేజర్ జలాశయాల పరిధిలో అరణియార్ ప్రాజెక్టు ఉండడంతో ప్రాజెక్టుకు నిర్ణయించిన ప్రత్యేక తేదీల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.

సత్యవేడు నియోజకవర్గంలో మండలాల వారీగా ఎన్నికలు జరగనున్న ఆయకట్టు సంఘాలు

మండలం	ఆయకట్టు సంఘాల సంఖ్య
సత్యవేడు	13
కేవీబీపురం	26
వరదయ్యపాళెం	31
బుచ్చినాయుడుకండ్రిగ	11
పిచ్చాటూరు	09
నారాయణవనం	06
నాగలాపురం	11

డిసెంబర్ 8న ఎన్నికలు..

ఐదేళ్ల తర్వాత సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. డిసెంబర్ 5 ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కానుంది. ఎన్నికలు 8వ తేదీన జరగనున్నాయి. అందుకు సంబంధించి తాజాగా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. సంఘాలు ఏర్పాటుతో జలాశయాలు, చెరువుల అభివృద్ధితో పాటు కాలువల్లో పూడిక తొలగింపునకు మోక్షం లభించనుంది. ఒక సంఘంలో ఒక అధ్యక్షుడు, ఆరుగురు సభ్యులు ఉంటారు.

మార్గదర్శకాల ప్రకారమే..

సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే మార్గదర్శకాల ప్రకారం ఆ ప్రక్రియ పూర్తి చేయనున్నాం. తహసీల్దార్ నుంచి ఆయకట్టు రైతుల ఓటర్ల జాబితాలను తీసుకున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు సాగునీటి సంఘాల వివరాలను సేకరించాం. డిసెంబర్ 5న ఫైనల్ నోటిఫికేషన్ ఇస్తాం. డిసెంబర్ 8న ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– రత్నాకర్ రెడ్డి, జలవనరుల శాఖ, డీఈఈ, సత్యవేడు సబ్ డివిజన్

క్లుప్తంగా

హైస్కూల్లో పెరిగిన పని వేళలు


విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పని వేళను ప్రభుత్వం గంట సమయం పెంచింది. సోమవారం గంట పని వేళ పెరగడంతో పాఠశాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు జరిగాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను మోడల్‌గా ఎంపిక చేశారని, భవిష్యత్‌లో మరిన్ని స్కూళ్లను ఎంపిక చేస్తారని ఎంఈఓ రవీంద్రనాథ్ తెలిపారు. గంట పెంపుపై ఉపాధ్యాయులు అసంతృప్తి చేస్తున్నారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మృత్యుంజయస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయ స్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారిని చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విబూధి వంటి వాటితో అభిషేకించి, అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని ధర్నా



వినతిపత్రం ఇస్తున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

రేణిగుంట: మండలంలోని ఇళ్లు లేని నిరుపేదలకు వెంటనే ఇంటిస్థలాలను ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తులసిరాజన్ డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాల సమస్యలపై సోమవారం రేణిగుంట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రాజన్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలో రేణిగుంట మండలంలో ఇచ్చిన పట్టాలకు వెంటనే స్థలం చూపించాలని డిమాండ్ చేశారు. పట్టాలు ఇచ్చినా, పాగాలి వద్ద స్థలాలను చూపలేదని, ఆ సమస్యను అధికారులు పరిష్కరించి పేదలకు సొంతింటి కలను నెరవేర్చాలన్నారు. పక్కాగృహ నిర్మాణం కోసం రూ.5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సురేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకురాలు శంషాద్‌బీ, చలపతి, సుబ్బలక్ష్మి, లక్ష్మి, చంద్రయ్య, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృత దేహం లభ్యం

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లం చెక్‌పోస్టు కూడలి వద్ద చెట్లపొదల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. సమాచారాన్ని వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్‌కు ఇవ్వడంతో ఎస్‌ఐ మల్లికార్జున్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అయితే మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. స్థానికుల సమాచారం మేరకు మూడు రోజుల క్రితం మద్యం మత్తులో బత్తలవల్లం పరిసర ప్రాంతాల్లో తిరుగుతుండేవాడని తెలిపారు. దీనిపై స్పందించిన ఎస్‌ఐ స్థానికంగా సీసీపుటేజీల ద్వారా మృతి చెందిన వ్యక్తి తిరుగుతున్న వీడియోలు వెలికి తీశారు. ఆ వీడియోలను అటు తమిళనాడు, ఇటు ఆంధ్రలో పలు ప్రాంతాలకు చెందిన పోలీస్ స్టేషన్లకు పంపించి వివరాలు తెలుసుకునే పనిలో ఉన్నారు. కేసు నమోదు చేసి శవపంచనామా నిమిత్తం మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు నాగలాపురం విద్యార్థిని


మీనాక్షి

నాగలాపురం: కాకినాడలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ క్రీడా పోటీలకు సంబంధించి అండర్–14 విభాగం రగ్బీ పోటీలలో ప్రతిభ చాటి తమ స్కూలు 9వ తరగతి విద్యార్థిని ఎం.మీనాక్షి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూడి కస్తూరయ్య సోమవారం తెలిపారు. బిహార్ రాష్ట్రం పాట్నా వేదికగా జరగబోయే జాతీయ స్థాయి పోటీలలో మీనాక్షి పాల్గొంటుందని చెప్పారు. ఆ విద్యార్థినిని, శిక్షణ ఇచ్చిన పీఈటీ బాబు, సురేంద్రను హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు మృతి


బందిల బాలయ్య(ఫైల్)

వరదయ్యపాళెం: మండలంలోని కంచరపాళెంకు చెందిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బందిల బాలయ్య (72) అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలతో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడిగా, కంచరపాళెం గ్రామ పంచాయతీకి రెండు పర్యాయాలు సర్పంచ్‌గా, కాంగ్రెస్ పార్టీలో డీసీసీ, పీసీసీ కార్యవర్గంలో సభ్యుడిగా పనిచేశారు. ఓ పర్యాయం బీఎస్పీ తరఫున సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 50 ఏళ్ల పాటు సుదీర్ఘంగా రాజకీయాల్లో కొనసాగాడు. ప్రస్తుతం అంబేడ్కర్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన మరణం పట్ల నియోజకవర్గ దళిత సంఘం నాయకులు, ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రగాఢసంతాపం తెలిపారు. అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం కంచరపాళెంలో జరుగుతాయని బాలయ్య కుమారులు, బందిల సురేష్, బందిల కుమార్ తెలిపారు.

పలువురు పరామర్శ..

బందిల బాలయ్య మరణించిన విషయం తెలిసి పలువురు రాజకీయ ప్రముఖులు ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ మేరకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఫోన్ చేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన మరణంపై ప్రగాఢ సంతాపం తెలిపారు.

తప్పు చేసిన వారికి చట్టపరంగా శిక్ష పడాలి


ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య సంఘాల లీడర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రమైన బుచ్చినాయుడుకండ్రిగలో సోమవారం జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేఖంగా జాతీయ ప్రచార కార్యాక్రమంలో భాగంగా మండల మహిళా సమాఖ్య లీడర్లు, సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మునెయ్య మాట్లాడుతూ నేటి నుంచి డిసెంబరు 23వ తేదీ వరకు జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో వివిధ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. నెల రోజులపాటు అన్ని సంఘాల్లో జరిగే సమావేశాల్లో కచ్చితంగా అజెండా పెట్టి చర్చించడంతో పాటు అందరి దగ్గర ప్రతిజ్ఞ చేయించాలని, మహిళలు పని చేసే ప్రదేశాలలో ఎలాంటి హింస జరిగినా వారికి న్యాయం కోసం అందరూ మాట్లాడాలన్నారు. తప్పు చేసిన వారికి చట్టపరంగా శిక్ష పడేలా చూడాలని తెలిపారు. అలాగే ప్రతి తల్లి తన మగ బిడ్డతో సమానంగా ఆడబిడ్డను చూడాలని, ఇద్దరికీ సమాన బాధ్యతలు, హక్కులను గుర్తు చేయాలన్నారు. కార్యక్రమంలో సీసీలు వెంకటరత్నం, అకౌంటెంట్ గిరిజ, మండల సమాఖ్య లీడర్లు, గ్రామ సమాఖ్య లీడర్లు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

భూసమస్యలను పరిష్కరించండి


మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో భూసమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని తహసీల్దారు సుబ్రమణ్యం ఆదేశించారు. సోమవారం ఆయన కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఓలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిశీలిస్తానని తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు నమోదు చేయించాలని సూచించారు. చెరువులు, శ్మశానాల్లో ఆక్రమణలు ఉంటే తొలగించాలన్నారు. కార్యక్రమంలో డీటీ చంద్రబాబునాయుడు, సీనియర్ అసిస్టెంట్ నల్లయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

రేణిగుంట(ఏర్పేడు): సైబర్ నేరాల గురించి ప్రతి ఒక్కరికీ సంపూర్ణ అవగాహన కలిగి ఉండడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. ఏర్పేడులోని ఓంనారాయణ స్కూల్ ఆవరణలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమావళిని గురించి వివరించారు. గంజాయి అక్రమ రవాణా, అసాంఘిక, సంఘ విద్రోహ కార్యక్రమాలు ఎక్కడైనా జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇచ్చి అరికట్టడంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఏర్పేడు సీఐ జయచంద్ర, ఓంనారాయణ స్కూల్ కరెస్పాండెంట్ చింత మోహన్‌యాదవ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలను పాటించకుంటే చర్యలు

రేణిగుంట: లారీ పార్కింగ్ విషయంలో ట్రాఫిక్ నియమాలు పాటించకుంటే చర్యలు తప్పవని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. రేణిగుంటలో మంగళవారం సాయంత్రం లారీ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ ఓనర్స్‌తో సమావేశం నిర్వహించారు. రేణిగుంటలో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతోందని పాత చెక్‌పోస్ట్ నుంచి జ్యోతినగర్ వైపు, రమణ విలాస్ సర్కిల్ నుంచి రామకృష్ణాపురం సర్కిల్ వరకు, రమణ విలాస్ సర్కిల్ నుంచి ఏర్పేడు మార్గం వైపు రోడ్డు పక్కన పార్కింగ్ చేయకూడదని సూచించారు. పార్కింగ్ చేయడం వల్ల రాత్రివేళల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాగే మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని ఆదేశించారు. అర్బన్ సీఐ శరత్‌చంద్ర, ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మోక్షప్రదాత.. నమోస్తుతే..


విశేష అలంకరణలో మూలస్థానేశ్వరుడు


పరశురామేశ్వరుడికి భస్మాభిషేకం

రేణిగుంట: కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా మండలవ్యాప్తంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గాజులమండ్యం శ్రీకామాక్షి దేవి సమేత మూలస్థానేశ్వరాలయంలో స్వామివారి మూలవిరాట్‌కు అభిషేక పూజలు చేసి శోభాయమానంగా అలంకరించారు. రాత్రి ఆలయ ఆవరణలో శివలింగం ప్రతిమతో కూడిన నేతిదీపాలను వెలిగించి మహిళలు మొక్కులు చెల్లించారు. ఆలయ నిర్వాహకులు జువ్వల ధనుంజయరెడ్డి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. అలాగే గుడిమల్లం పరశురామేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఆలయ ఆవరణలో నేతి దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయంలో ఉజ్జయినీ మహంకాళీ అలంకరణలో స్వామివారికి భస్మాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరిబాబు, ఈఓ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు స్థల పరిశీలన

శ్రీకాళహస్తి: హైకోర్టు ఆదేశాల మేరకు మార్కెట్‌వీధి సినిమా హాల్ పక్కన గత 30 ఏళ్లుగా బంకులు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటున్న వ్యాపారులకు వేరే ప్రాంతంలో స్థలాలను కేటాయించేందుకు మున్సిపల్ కమిషనర్ గిరికుమార్ చర్యలు తీసుకున్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు అక్కడ వ్యాపారులను తొలగించామన్నారు. వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించి స్థల పరిశీలన చేశామని తెలిపారు. మరో మూడు రోజుల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గురవయ్య, వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐ లింకు తప్పనిసరి

శ్రీకాళహస్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాల సబ్సిడీలు పొందాలంటే ఎన్‌పీసీఐ లింకు తప్పనిసరి అని తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ బాలాజీ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ పరిధిలో ప్రతి తపాలాశాఖ కార్యాలయంలో ఎన్‌పీసీఐ లింకు కోసం ప్రత్యేక శిబిరాలను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే సంక్షేమ పథకాలు, గ్యాస్ సబ్సిడీ నగదు నేరుగా బ్యాంకు ఖాతాకు జమ కావాలంటే ఎన్‌పీసీఐ లింకు తప్పనిసరి అన్నారు. ప్రజలు ఆధార్, మొబైల్‌ఫోన్ తీసుకొచ్చి కేవలం రూ.200 పోస్టల్ కార్యాలయంలో ఐపీపీబీ ఖాతా తెరచుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి మృతి


వెంకట రమణయ్య(ఫైల్)

వరదయ్యపాళెం: మండలంలోని సీఎల్‌ఎన్‌పల్లికి చెందిన చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గులపల వెంకటరమణయ్య సోమవారం హఠాన్మరణం చెందారు. చేనేత సమస్యలపై నిత్యం నియోజకవర్గ స్థాయిలో అనేక పోరాటాలు చేసి కార్మికుల పక్షాన నిలబడిన వెంకటరమణయ్య మృతి చెందడంపై పలువురు ప్రగాఢ సంతాపం తెలిపారు. వెంకటరమణయ్య మృతి బాధాకరమని, ఆయన మృతదేహాని పలువురు నాయకులు నివాళులు అర్పించారు.

అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు సీజ్

– శ్రీకాళహస్తి ఏడీఏ రమేష్ రెడ్డి


పురుగుమందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న శ్రీకాళహస్తి ఏడీఏ రమేష్ రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

వరదయ్యపాళెం: మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 21న ‘పైరుకు చేటు.. రైతుకు పోటు!’ అనే కథనం సాక్షిలో ప్రచురితమైంది. దీనికి స్పందించిన జిల్లా వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు తక్షణమే నిషేధిత పురుగు మందులు, అధిక ధరలతో విక్రయిస్తున్న ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ మేరకు శ్రీకాళహస్తి ఏడీఏ రమేష్ రెడ్డి ఆయన తన సిబ్బందితో కలసి సోమవారం మండలంలోని అన్ని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఇప్పటివరకు విక్రయించిన పురుగు మందులు, వాటి రికార్డులు, నిల్వ ఉన్న స్టాకు వివరాలను పరిశీలించారు. పలు దుకాణాల్లో రూ.2.86 లక్షలు విలువ చేసే బిల్లులు లేకుండా అదనంగా పురుగు మందులను నిల్వ ఉంచి అమ్మకానికి సిద్ధంగా ఉంచినట్లు గుర్తించారు. బిల్లులు లేని మందులను విక్రయించకూడదని సంబంధిత మందులను తక్షణమే వెనక్కి పంపాలని దుకాణదారులను హెచ్చరించారు. ఏ దుకాణదారుడైన అదనపు రేట్లకు విక్రయిస్తే వారి లైసెన్సులు సీజ్ చేస్తామని ఏడీఏ హెచ్చరించారు. కచ్చితంగా ఎంఆర్‌పీ ధరలకు విక్రయించాలని తెలిపారు. ఈ తనిఖీల్లో సత్యవేడు ఏఓ మురళి, వరదయ్యపాళెం ఏఈఓ ప్రవీణ్ ఉన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష.. ఆరోగ్యానికి రక్ష


మహిళలకు రక్త పరీక్షలు చేస్తున్న ఏఎన్‌ఎంలు

సత్యవేడు: ప్రాథమిక దశలోనే క్యాన్సర్ లక్షణాలను గుర్తించడం ద్వారా క్యాన్సర్ బాధితులు మరణాల సంఖ్యను తగ్గించవచ్చని డాక్టర్ చైతన్యభాను అన్నారు. సోమవారం సత్యవేడు, శిరణంబూదూరు పంచాయతీల్లో పింక్ బస్సు ద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కోవాలంటే ముందస్తుగా నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలన్నారు. ఒక వ్యకిలోని క్యాన్సర్ కణాల కోసం వెతకడాన్నే క్యాన్సర్ స్క్రీనింగ్ అని పిలుస్తారన్నారు. నోటి క్యాన్సర్, రొమ్ముక్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ ప్రమాదకరమైనవని తెలిపారు.

రైల్వే స్టేషన్ వద్ద ఇసుక గుట్టలు


రైల్వేస్టేషన్ సమీపంలో గుట్టలుగా పోసిన ఇసుక

శ్రీకాళహస్తి: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో కొండలను తలపించేలా ఇసుక గుట్టలు పోసి ఉన్నాయి. అక్కడి వారిని ప్రశ్నించగా రైల్వేస్టేషన్ అభివృద్ధిలో భాగంగా ఇసుకను డంప్ చేస్తున్నామని తెలిపారు. గత నెల రోజులుగా చుక్కలనిడిగల్లు, ఎంజీఎం పక్కన గల గొడ్డేరు కాలువ, పుల్లారెడ్డికండ్రిగ ప్రాంతాల్లో జేసీబీలతో ఇసుక తవ్వి రాత్రికి రాత్రి రైల్వేస్టేషన్‌లో గుట్టలుగా పోస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తున్నారా.. ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారా..? అనే విషయం అర్థం కాని పరిస్థితి. దీనిపై తహసీల్దారు లక్ష్మీనారాయణను వివరణ కోరగా తన దృష్టి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

స్వాధీనం చేసుకున్నాం..కేసులు పెడుతాం

తొట్టంబేడు మండలంలోని రిలయన్స్ పెట్రోల్ బంకు వెనుక తంగేళ్లపాళెంలోని ఓ క్రషర్‌లో డంప్ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకున్నామని తొట్టంబేడు తహసీల్దారు మధుసూదన్‌రావు తెలిపారు. ఆ ఇసుక తమదని ఎవరూ రాకపోవడంతో డంప్ చేసిన స్థల యజమానులపై కేసులు పెడుతామన్నారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను ప్రభుత్వ అవసరాలకు ఉపయోగిస్తామని చెప్పారు.

సందడిగా కార్తీక వన సమారాధన


ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సత్యవేడు: భిన్న రంగాల వ్యక్తులను ఒకచోట చేర్చేందుకు వన సమారాధనలు దోహదం చేస్తాయని అటవీశాఖ అధికారి బ్రహ్మయ్య అన్నారు. సోమవారం ఫారెస్టు కార్యాలయం సమీపంలోని వనరాజ విఘ్నేశ్వరస్వామి ఆలయం ఫారెస్టు డీఎం ఆధ్వర్యంలో వన సమారాధన కోలాహలంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని వనరాజ విఘ్నేశ్వరస్వామి వారికి పలు రకాల పూలతో అలంకరించి అభిషేక పూజలు చేశారు. శ్రీవిశాలాక్షి సమేత విశ్వనాథస్వామి ఆలయంలో శివలింగానికి రుద్రాభిషేకం, బిల్వార్చన, అభిషేక పూజలు పూజా క్రతువులు పూజారులు ఎం.అయ్యప్ప, బి.మునిస్వామి నిర్వహించారు. ఉసిరి చెట్టు సమీపంలో పార్వతీదేవి ప్రతిమను అలంకరించి దీపాలు వెలిగించి కుంకుమార్చన పూజ కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో జరిపించారు. అనంతరం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో పలు కార్యాలయాల అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

